


## ఈ వి ఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

### ..జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల,అక్టోబర్ 6, సత్యదీపిక ఉదయం :**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల ఈ వి ఎం గోదామును ఎన్నికల విభాగం అధికారులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన

### ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం

**- సమాజ సేవలో మరింత చురుగ్గా పనిచేయాలి -కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 06,సత్యదీపిక ఉదయం :**



ఆదిలాబాద్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టనున్న వివిధ సేవా కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అత్యవసర సమయాల్లో బాధితులకు సహాయ చర్యలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా, సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించి పేదలు, నిరుపేదలు, బాధితులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని సూచించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. సమాజ హితం కోసం నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆదే క్రాంతి కుమార్, మనోహర్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

**- కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి- సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి - డ్రగ్స్ ప్రభావానికి గురైన వారికి తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స అందేలా చర్యలు - రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**పెద్దపల్లి ప్రతినిధి,అక్టోబర్ 06,సత్యదీపిక ఉదయం :**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమాన్ని అభినందించారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలు

ఇంజినీరింగ్,డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేలా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కేవలం సరదా లేదా థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించవద్దని యువతకు సూచించారు. డ్రగ్స్‌కు బానిసలైతే విద్య,కెరీర్‌తో పాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు,ప్రజలు సమష్టిగా కృషి చేస్తేనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు.

### డ్రగ్స్ ప్రభావితులకు తక్షణమే డీ-అడిక్షన్ చికిత్స

ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి కోరారు. సమాచారం అందిన వెంటనే అవసరమైన డీ-అడిక్షన్ చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను డ్రగ్స్ కారణంగా నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో యువత,ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్,డీసీపీ, పోలీస్ అధికారులు, సిబ్బంది,యువత, ప్రజలు కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్,ఏసీపీ కృష్ణ,పోలీస్ అధికారులు, సిబ్బంది,యువత, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

**నిర్వాహకులు స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్ పై**

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

# అవగాహన కలిగి ఉండాలి



**మంచిర్యాల ప్రతినిధి,అక్టోబర్ 6, సత్యదీపిక ఉదయం**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్మార్ట్ అసెస్మెంట్ పోర్టల్ (పిసిఎస్ఏపి) పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, ఆసిఫాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్ , ఆసిఫాబాద్ పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, జిల్లా సహకార అధికారి కరుణాకర్,ఎఫ్.సి.ఐ. అధికారి సుఖీష్ , సంబంధిత అధికారులతో కలిసి యాప్ వినియోగం, ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఎఫ్.సి.ఐ. అధికారులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్ణీత మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను కొంత ఎత్తైన, చదును ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, గోనె సంచులను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, మరుగుదొడ్లు, విద్యుత్, టేబుళ్లు, కుర్చీలు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు



తదితర సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో 2 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, 30 టార్పాలిన్లు, 1 ప్యాడీ క్లీనర్ అందుబాటులో ఉంచాలని, ప్యాడీ క్లీనర్ అందుబాటులో లేని చోట ట్రాక్టర్ మౌంటెడ్ ఫ్యాన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరుస క్రమంలో ధాన్యం కొనుగోలు చేయాలని, రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చినప్పుడు తేమ శాతం 17 శాతానికి మించి ఉంటే, ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమ శాతం తగ్గిన తర్వాత తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల నుంచి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ నకలు ప్రతులను తీసుకోవాలని, ప్రభుత్వం ప్రకటించిన 7 రకాల ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసే ముందు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పి.సి.ఎస్.ఎ.పి. యాప్‌లోని 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ధాన్యానికి సంబంధించిన ఖచ్చితమైన ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వరుస దొంగతనాలకు పాల్పడుతున్న**

# నిందితుడి అరెస్ట్

**- బంగారు, వెండి ఆభరణాలు,నగదు స్వాధీనం,పలు దొంగతనం కేసుల్లో పురోగతి సాధించిన పోలీసులు**

**జైపూర్ ,సత్యదీపిక ఉదయం :**

ఇళ్లకు తాళాలు వేసి ఉన్న సమయంలో తాళాలు పగులగొట్టి వరుస దొంగతనాలకు



పాల్పడుతున్న నిందితుడు సబ్బాని లక్ష్మీనారాయణ ఏ చింటూను జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైపూర్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. నిందితుడు తన స్నేహితుడు మహ్మద్ మగ్దూంతో కలిసి సెప్టెంబర్ 28న ఇందారం గ్రామంలో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారు,వెండి ఆభరణాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన నగదు, ఆభరణాలను ఇద్దరూ పంచుకున్నట్లు నిందితుడు తెలిపాడు. అదేవిధంగా, బెల్లంపల్లి రైల్వే రాడగంబల బస్తీలో జనవరి 16న, గాంధీనగర్‌లో జూలై 9న,ఇందారం గ్రామంలో సెప్టెంబర్ 24న ఇళ్లకు తాళాలు పగులగొట్టి నగదు,వెండి వస్తువులు, ల్యాప్‌టాప్,సెల్‌ఫోన్ తదితర వస్తువులను దొంగిలించినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు 2 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ.3,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి నిందితుడి సహచరుడిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి,అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు,వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు, నగదును ఇంట్లో ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించినప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం

**కడం,అక్టోబర్06,సత్యదీపిక ఉదయం :**



మండలంలోని సారంగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, విద్యా బోధనతో పాటు మెరుగైన సేవలు అందుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ భవనాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు గంగన్న, ఏఎంసీ చైర్మన్ పాడిగెల్ భూషణ్, ఆర్టీఏ మెంబర్ తుమ్మల మల్లేశ్ యాదవ్, గ్రామ సర్పంచ్ కోలా తేజస్విని శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు సుదాకర్, సలీమ్, రెంకల శ్రీనివాస్,అలాగే అంగన్వాడీ టీచర్లు, ఎంఆర్ఓ ఖాజా మోహినొద్దీన్,ఎంపీడీఓఅరుణ,అంగన్వాడీ సూపర్వైజర్లు, పంచాయతీరాజ్ డీఈ సూర్య తేజ్, ఏఈచందన్, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్పత్తి పెంపుపై**

# సింగరేణి ఫోకస్

**... మందమర్రి ఏరియాలో ఉన్నతస్థాయి కసరత్తు.**

**బెల్లంపల్లి, అక్టోబర్ 06, సత్య దీపిక ఉదయం:**



సింగరేణి మందమర్రి ఏరియాలో 2026-27, 2027-28 ఆర్థిక సంవత్సరాలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు, గనుల అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఆన్యువల్ ప్లాన్ కమిటీ, టార్గెట్ కమిటీ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశానికి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణతో పాటు కార్పొరేట్ కార్యాలయానికి చెందిన కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాధించిన నెలవారీ బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు పురోగతిని కమిటీ సమీక్షించింది. రాబోయే నెలల్లో సాధించాల్సిన లక్ష్యాలు, వాటి కోసం చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2027-28 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఉత్పత్తి లక్ష్యాలు, వాటి సాధనకు అవసరమైన ప్రణాళికలపై కూడా సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు పనులతో పాటు భూగర్భ గనుల్లో డెవలప్‌మెంట్, డిపిల్లరింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఉద్యోగులు, కార్మికుల సంఖ్య, ఉత్పాదకత, గనుల్లో వినియోగిస్తున్న భారీ యంత్రాల పనితీరు, వాటి గరిష్ట సామర్థ్య వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే గనుల విస్తరణకు కీలకమైన భూసేకరణ, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్ అండ్ ఆర్), పర్యావరణ అనుమతులు (ఈసి), అటవీ శాఖ క్లియరెన్స్‌ల ప్రస్తుత స్థితిగతులను కమిటీ పరిశీలించింది. లక్ష్యాల సాధనలో ఎదురవుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులు, కార్పొరేట్ కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సమావేశంలో మందమర్రి ఏరియాలోని వివిధ గనుల ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు, గని మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**



**మంచిర్యాల అక్టోబర్ 6, సత్యదీపిక ఉదయం :** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, హౌసింగ్ కార్పొరేషన్ పిడి బన్సీలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ అధికారి రవీందర్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ తిరుపతి, ఎ.పి.డి. మోహన్ లతో కలిసి వి బి జి రామ్ జి, ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతలు, పారిశుధ్యం, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లు, ఇంటి పన్నుల వసూళ్లు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకం క్రింద జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ, వి.ఓ., అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మాణం పూర్తైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఐ.హెచ్.హెచ్.ఎల్. చెల్లింపులు పూర్తయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు మంజూరైన 5.50 కోట్ల రూపాయల నిధులను మెటీరియల్ కాంపోనెంట్ క్రింద వినియోగించి, సంబంధిత భవనాల నిర్మాణ వ్యయాన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 2 బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జిల్లాలో ఇప్పటికే మంజూరైన 3 వేల 150 ఇంకుడు గుంతలకు మార్కింగ్ పూర్తి చేసి పనులను ప్రారంభించాలని, మిగిలిన ఇంకుడు గుంతలకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, పండుగ నిర్వహించే ప్రాంతాలలో ముళ్ల పొదలు, చెట్లు తదితర అవరోధాలు ఉంటే సంబంధిత మండల పంచాయతీ అధికారులు వాటిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి... యాజమాన్యం వర్సెస్ కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు

**...ప్రజాభవన్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు ...కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని..సింగరేణి అధికారుల తీరు మార్చుకోవాలని పంతం**

**సింగరేణి ప్రతినిది,అక్టోబర్06,సత్యదీపిక ఉదయం**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి కోల్డ్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు , మంత్రులు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సమక్షంలో సింగరేణి యాజమాన్యం హైదరాబాదులో ప్రజా భవన్ లో నిర్వహించిన సమావేశం వాడి వేడిగా జరిగింది సింగరేణి అధికారులు కార్మికుల పట్ల ప్రదర్శిస్తున్న ధోరణి పట్ల కూల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు అగ్రహారం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రతినిధులు గా కార్మికుల కోసం ఏదైనా పనులు చేద్దాం అంటే జిమ్ స్థాయి అధికారుల నుండి కార్పొరేట్ స్థాయి అధికారుల వరకు అడ్డుకుంటున్నారని దీనివల్ల సింగరేణి కార్మికులకు ప్రజా ప్రతినిధుల పట్ల , ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వచ్చేలా ఉందని ఇకనుండి అయినా అధికారులు తమ తీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పారదర్శకంగా వ్యవహరించి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని అదేవిధంగా మెడికల్ బోర్డులో అర్హులైన వారందరినీ మెడికల్ అండ్ ఫిట్ చేసి వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని సింగరేణి పరిరక్షణ కోసం నూతన ప్రాజెక్టుల కోసం ప్రయత్నాలు చేసి కార్మికులను నెలకొన్న భద్రత భావాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క్, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, ఐ ఎన్ టి సి జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ తో సింగరేణి సి అండ్ ఎండి తో పాటు డైరెక్టర్ పాల్గొన్నట్లు సమాచారం.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం

### కమాన్పూర్ మండల అధ్యక్షుడిగా భూపెల్లి. మల్లేష్

**సింగరేణి ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :**



ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమాన్పూర్ మండల అధ్యక్షుడిగా భూపెల్లి. మల్లేష్ ను నియమిస్తున్నట్లు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు బొంకురి .మధు పేర్కొన్నారు. కాగా కమాన్పూర్ మండలశ్రీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో భూపెల్లి. మల్లేష్ కు నియామక పత్రంతోపాటు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా భూపెల్లి మల్లేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ యువజన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకరం చుడుతూ యువజనులు సామాజిక సేవ కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు కాగా ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు బొంకురి మధు, భూపెల్లి జ్యోతి , అగ్గిమల్ల నర్సయ్య, గోషిక లింగయ్య, పనుగంటి రవి, అంబటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### గోశాల, వేద పాఠశాల కోసం

## ప్రభుత్వ స్థలం కేటాయించాలి

**- తహసీల్దార్‌కు బ్రాహ్మణ సేవా సమితి వినతి**

**బెల్లంపల్లి, అక్టోబర్ 06, సత్య దీపిక ఉదయం:** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో గాయత్రీ మాత ఆలయం, గోశాల, యాగశాల, వేద పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు మంగళవారం తహసీల్దార్ కృషకు



వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబాలు వివిధ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ సంఘానికి కూడా ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే గాయత్రీ మాత ఆలయంతో పాటు గోశాల, యాగశాల, వేద పాఠశాల ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగకరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించి తమ వంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు వీఎల్ఎస్ శ్రీనివాస్ రావు, కోశాధికారి జగన్మోహనాచారి, సలహాదారు రాంభట్ల హరీష్ శర్మతో పాటు ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## రఘునాథ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :** బీజేపీ పార్టీలో ఎలాంటి బాధ్యతలు లేని బొలిశెట్టి తిరుపతి మరియు బీజేపీ పార్టీ నుండి సస్పెండ్ అయిన మడిపల్లి సత్యం నిన్న పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం, వారిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో హాజీపూర్ మండల అధ్యక్షులు గడ్డం స్వామి రెడ్డి,మంచిర్యాల కార్పొరేషన్ గర్మిళ్ళ జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్,నస్పూర్ జోన్ అధ్యక్షులు కర్రె చక్రవర్తి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం కృషి చేస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పై,బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పై వ్యక్తిగత ఆరోపణలు ,విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కొందరు భూ సెటిల్మెంట్ చేసే వారితో జత కట్టి బీజేపీ పార్టీకి నష్ట పరిచే విధంగా జిల్లాలో బీజేపీ పార్టీ ఎదుగుదలకి కృషి చేస్తే రాబోయే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా నిరంతరం పార్టీ కోసం పని చేస్తే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతి సమస్యల పై పోరాటం చేస్తున్న



రఘునాథ్ పై ప్రస్తుతం బీజేపీ పార్టీలో ఎలాంటి పదవి లేని బొలిశెట్టి తిరుపతి మరియు పార్టీ నుండి సస్పెండ్ అయిన మడిపల్లి సత్యం అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటు అని విమర్శించారు. జాతీయ రహదారి 63 విషయంలో రఘునాథ్ ఎవరికి నష్టం కాకుండా లక్షట్టిపేట పట్టణం నుండి కాకుండా పట్టణానికి బై పాస్ రోడ్డు నిర్మించాలని కోరారే తప్ప అలైన్మెంట్ మార్చాలని ఎక్కడ కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరలేదని తెలిపారు. జాతీయ రహదారి విషయంలో రఘునాథ్ వ్యాపారుల నుండి డబ్బులు తీసుకున్నారు అని చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో న్యాయ పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తలను అవమానించే విధంగా పాలేరులకు పదవులు ఇస్తున్నారని అనడం బాధాకరమని అన్నారు. గతంలో తిరుపతిని రఘునాథ్ హాజీపూర్ మండల అధ్యక్షులు మరియు సత్యంను మండల ప్రధాన కార్యదర్శిగా చేసి పార్టీ బాధ్యతలు అప్పచెప్పిన రఘునాథ్ పాలేరులా అని ప్రశ్నించారు. బొలిశెట్టి తిరుపతి కుమారుడికి గతంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా,ప్రస్తుతం యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బాధ్యతలు ఇప్పించిన నాయకుడు రఘునాథ్ అని తెలుసుకోవాలని సూచించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న రఘునాథ్ పై మరియు వెంకటేశ్వర్ గౌడ్ పై అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, గడ్డం స్వామి రెడ్డి, కుర్రె చక్రవర్తి, మధువరపు రమణ రావు, బియ్యాల సతీష్ రావు, హనుమండ్ల శ్రీనివాస్, కొట్టే ప్రశాంత్, మెరెడికొండ శ్రీనివాస్, రాజనర్సు, కొంకటి మహేందర్, ఇలవేణి సతీష్, సాగర్, చిందం తిరుపతి, బూర్ల అజయ్, కంపల్లి రవి మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిన ఆల్ఫోర్స్ బతుకమ్మ కార్నివాల్

**ఆల్ఫోర్స్ ప్రాంగణం**

రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు,

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబంగా వేడుకలు.**

**- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.**





**బెల్లంపల్లి, అక్టోబర్ 06, సత్య దీపిక ఉదయం:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో బతుకమ్మ కార్నివాల్, కోలాటం ఉత్సవాలను అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.



విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై, రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకురావడంతో విద్యాసంస్థల ప్రాంగణం పూలవనంలా, పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బతుకమ్మ కార్నివాల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉందని అన్నారు. ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. వివిధ రకాల పూలను సేకరించి, వాటిని అందంగా పేర్చి బతుకమ్మగా రూపొందించడం తెలంగాణ ప్రజల ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు.

బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, మహిళల ఐక్యత, ప్రకృతి పట్ల గౌరవం, సామాజిక సమైక్యతను ప్రతిబింబించే గొప్ప సాంస్కృతిక సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు. ఆధునిక విద్యతో పాటు విద్యార్థులు తమ మూలాలను, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఆత్మీయత పెరుగుతుందని తెలిపారు.

### పూల బతుకమ్మలతో సందడిగా ప్రాంగణం...

బతుకమ్మ కార్నివాల్ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పుష్పాలతో ఎంతో అందంగా, ఆకర్షణీయంగా బతుకమ్మలను తయారు చేశారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించగా, విద్యార్థులు సైతం తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారుల నుంచి పెద్ద తరగతుల విద్యార్థుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో ఆల్ఫోర్స్ ప్రాంగణం పండుగ సందడితో కళకళలాడింది.

### ఆకట్టుకున్న కోలాటం ప్రదర్శనలు...

బతుకమ్మ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కోలాటం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి లయబద్ధంగా కోలాటం ఆడుతూ ప్రేక్షకులను అలరించారు. సంప్రదాయ గీతాలకు అనుగుణంగా విద్యార్థులు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సమన్వయం, క్రమశిక్షణ, ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు...

వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ జానపద కళలు, సంప్రదాయ నృత్యాలు, పాటలు, నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతి ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రాంగణంలో సందడి నెలకొంది. తమ సహచర విద్యార్థుల ప్రదర్శనలను చూసేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చప్పట్లతో అభినందించారు. సంప్రదాయం, ఆధునికత కలగలిసిన విద్యార్థుల ప్రదర్శనలు కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి.

### సంస్కృతి--విద్యకు వారధిగా కార్యక్రమాలు

విద్యార్థులకు పుస్తకాల్లోని విద్యతో పాటు మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బతుకమ్మ కార్నివాల్ ద్వారా విద్యార్థులు తెలంగాణ సంస్కృతిని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం పొందారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, సమన్వయం వంటి గుణాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు కూడా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

### పండుగ వాతావరణాన్ని తలపించిన

కోలాటం ప్రదర్శనలు, తెలంగాణ జానపద గీతాలు, నృత్య కార్యక్రమాలతో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. తెలంగాణ నేలతో, ప్రకృతితో, ప్రజల జీవన విధానంతో విడదీయరాని అనుబంధం కలిగిన బతుకమ్మ పండుగను విద్యార్థులతో కలిసి నిర్వహించడం ద్వారా మన సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేసే ప్రయత్నం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను చైర్మన్ వి. నరేందర్ రెడ్డి అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని ప్రశంసిస్తూ, చదువుతో పాటు కళలు, క్రీడలు, సంస్కృతి, సంప్రదాయాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ సమాజానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపు వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ కార్నివాల్--కోలాటం ఉత్సవం విజయవంతంగా ముగిసింది. ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల మరింత మమకారాన్ని పెంపొందించాయి.

## మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనను విజయవంతం చేయాలి

**ఆదిలాబాద్,అక్టోబర్06,సత్యదీపిక ఉదయం :**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో



పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వర్కింగ్ జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణా తరగతులకు సంబంధించిన ఆహ్వానాన్ని మీడియా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్లకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ పర్యటనతో పాటు శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రొటోకాల్ చర్యలపై కలెక్టర్, ఎస్పీలకు వివరించారు. కార్యక్రమం సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాలోని జర్నలిస్టులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీడియా ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, మీడియా ప్రతినిధులు దేవేందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు వేగవంతం చేయాలి..జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో,సత్యదీపిక ఉదయం :**

జిల్లాలోని పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేసి, సకల సౌకర్యాలతో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల పురోగతి, కాలనీల్లో అవుట్‌సైడ్ పెయింటింగ్, అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇళ్ల బాహ్య సౌందర్యం కోసం నాణ్యమైన అవుట్‌సైడ్ పెయింటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో





రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అంతర్గత గ్రావెల్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పైప్‌లైన్ విస్తరణ, నల్లాల ఫిట్టింగ్ తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్దేశించిన కాలపరిమితిలోగా అన్ని పనులను పూర్తి చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధంగా ఉంచాలని, పనుల్లో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇవ్వాలి

-

**పట్టాలున్న పంపిణి శూన్యం**

**- ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్‌ల బతుకులు మారలేదు- మహబూబ్నగర్ అర్బన్ తాసిల్దార్ కార్యాలయం ముందు టిడబ్ల్యూజేఎఫ్ ధర్నా - ఈనెల 10న పాలమూరు టు ప్రజా భవన్ జర్నలిస్టుల పాదయాత్ర - ప్రజా ప్రభుత్వం జర్నలిస్టులకు వెంటనే ఇండ్లు ఇవ్వాలి- ధర్నాలో టిడబ్ల్యూజేఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయకుమార్ - జిల్లాలో ప్రతి జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి- టిడబ్ల్యూజేఫ్ జిల్లా కార్యదర్శి మొలకపల్లి గోపాల్ మహారాజ్ - చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి - ఐఎఫ్డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యులు పసుపుల శ్రీనివాస్**

**మహబూబ్ నగర్ 06అక్టోబర్,సత్యదీపిక ఉదయం :**

మహబూబ్ నగర్ పట్టణంలో అనేక సంవత్సరంలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు ఇండ్లు లేక చాలా ఇబ్బందులతో ఉన్నారని తక్షణమే ప్రభుత్వం జిల్లా అధికారులు జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయకుమార్ అన్నారు. మంగళవారం టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్బన్ తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య హాజరై మాట్లాడారు. ఇండ్ల కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న పాలక యంత్రాంగం గాని జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వాలంటే 360 డిగ్రీల పేరుతో సర్వేలు చేయించి అనర్హులుగా ప్రకటించే ఆలోచన విధానాన్ని సృష్టి పలకాలని ఆయన కోరారు. అర్హు లైన ప్రతీ జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వకపోగా కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇల్లు నిర్మించి పట్టాలు ఇచ్చినా కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో టీ డబ్ల్యూజె ఎఫ్ ఆధ్వర్యంలో చేసిన రిలే దీక్షల వల్ల హామీల వల్ల దీక్షలను విరమించడం జరిగిందని కానీ ఆ హామీలు నేటి వరకు అమలు కాలేదని ఆయన అన్నారు. కొంతమంది జర్నలిస్టులు సొంత గూడు లేకపోవడంతో అనారోగ్యాల బారిన పడి చనిపోయినట్లు ఆయన తెలిపారు. చాలామంది జర్నలిస్టులు కిరాయిలు కట్టలేక చాలా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారని ఆయన అన్నారు. గతంలో పట్టాలు ఇచ్చిన జర్నలిస్టులకు వెంటనే తాళాలు ఇవ్వాలని ఆయన అన్నారు. ప్రభుత్వాలు మారిన జర్నలిస్ట్ ల బతుకుల మారలేదని తెలిపారు. అనేకమంది జర్నలిస్టులకు ఇల్లు / పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇండ్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి జర్నలిస్టులకు అండగా నిలవాలని ఆయన కోరారు. లేనియెడల ఈనెల ఈనెల ట10వ తారీఖున పాలమూరు టు ప్రజా భవన్‌లి వరకు జర్నలిస్టుల పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో ప్రతి జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి

మహబూబ్నగర్ జిల్లాలో మండలాలు తాలూకాలో పనిచేస్తున్న జిల్లాలో, మండల తాలూకాలలో



మండల కేంద్రాల్లో తాలుకాల్లో వర్కింగ్ జర్నలిస్ట్ గా పనిచేస్తున్న జర్నలిస్టుల అందరికీ ఇండ్లు,ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్ మారాజ్ డిమాండ్ చేశారు. మీడియా రంగంలో అనేకమంది యువత ముందుకు వచ్చి ప్రజాసేవ కోసం పని చేస్తున్నారని తెలిపారు. యూట్యూబ్ ఛానల్ లో పనిచేసేవారికి కూడా ఇండ్లు ఇవ్వాలని అయన కోరారు.

ప్రభుత్వం చనిపోయిన జర్నలిస్ట్ లను ఆదుకోవాలని ఐ ఎఫ్ డబ్ల్యూజె జాతీయ కమిటి సభ్యులు పసుపుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. కొంతమంది ఇండ్లు లేని జర్నలిస్ట్ లు చనిపోయారని జిల్లా అధికారులు వెంటనే ఇవ్వలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మెట్టు కాడిప్రభాకర్ మాట్లాడారు. జర్నలిస్ట్ లకు తక్షణమే ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ ఘని నాయక్ కు బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. జర్నలిస్ట్‌లకు ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్ట్‌లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం నశించాలని నినాదాలు చేసి జర్నలిస్ట్ ఐక్యత ను చాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ గండి నరసింహులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి లింగగల్ల నరసింహులు, అటఘు జాతీయ కమిటీ సభ్యులు మోయాజ్, "ఘట జిల్లా కమిటీ నాయకులు రామకృష్ణ,మేకల శ్రీనివాస్ లు,చందు,జర్నలిస్ట్‌లు శ్రీనివాస్‌లు గౌడ్,జి. శ్రీనివాస్, వెంకట్,అఫ్రోజ్, సమీర్,జక్కా గోపాల్,నిరంజన్,బాలరాజ్, రాఘవేందర్, జర్నలిస్ట్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి 2025 లాభాల వాటాను కార్మికులకు వెంటనే చెల్లించాలి

**- తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ( టీబీజీకేస్) వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి.- జాతీయ సంఘాలు ... కార్మిక హక్కులను.. కల రాస్తున్నాయి.**

**సింగరేణి ప్రతినిధి, సత్యదీపిక ఉదయం :**

సింగరేణి కార్మికులు ఎంతో శ్రమించి , ప్రాణ త్యాగాలకు సైతం వెనకాడకుండా సింగరేణిలో అత్యధిక



ఉత్పత్తి సాధిస్తే రాష్ట్ర ప్రభుత్వం , జాతీయ సంఘాలు న్యాయమైన లాభాల వాటాను తెల్చకుండా కార్మికులకు తీవ్ర అన్ యాయాన్ని తీవ్ర అన్యాయాన్ని కలిగిస్తున్నాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అర్జీ త్రీ జీఎం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల లాభాల వాటాను .. 40/: వెంటనే ప్రకటించి చెల్లించాలని లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని



పేర్కొన్నారు. అనంతరం అర్జీ త్రీ జి యం సుంకర మధుసూదన్, ఎల్ పి జి ఎం కొలిపాక నాగేశ్వరరావు వినతి పత్రాలు అందజేశారు . ఈ కార్యక్రమంలో ఓసిపి టు , ఓసిపి వన్, అడ్రియాల లాంగ్వాల్ ప్రాజెక్టు ఫిట్ సెక్రెటరీలు , నాయకులు దేవా శ్రీను, పాశం శ్రీనివాస్ రెడ్డి, దాసరి మల్లేష్, గొర్రె క్రాంతికుమార్, గట్టు శీను తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ( ఎస్ సి సి డబ్ల్యూ యు - ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జిఎం ఆఫీస్ ముందు ధర్నా

**- సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 10 శాతం లాభాల వాటాను కేటాయించాలి( ఎస్ సి సి డబ్ల్యూ యు- ఐ ఎఫ్ టి యూ)- శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్‌కి మెమోరండం**



**మంచిర్యాల,సత్యదీపిక ఉదయం :**

సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటాని కేటాయించాలని మంగళవారం శ్రీరాంపూర్ జి.ఎం కార్యాలయం వద్ద సింగరేణి కాలర్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్ సి సి డబ్ల్యూ యు – ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి.బ్రహ్మానందం ( ఎస్ సి సి డబ్ల్యూ యు– ఐ ఎఫ్ టి యు ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ గత సంవత్సరం సింగరేణి యాజమాన్యం పర్మనెంట్ కార్మికులకు 34 శాతం లాభాల వాటాను చెల్లించింది. అంటే ఒక్కొక్కరికి రూ. 1,96,610 లాభల వాటా పంచింది. కానీ పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కేవలం 5500 రూపాయలు ఇచ్చి





చేతులు దులుపుకున్నది. సింగరేణి యాజమాన్యం కాంటాక్ట్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించడం వల్ల సింగరేణి యాజమాన్యానికి లాభాలు వస్తున్నాయి. ఒక పర్మినెంట్ కార్మినికి చెల్లించే వేతనంతో పదిమంది కాంట్రాక్ట్ కార్మికులను పెట్టుకోవచ్చు. వేతనాలలో తేడా ఉంది,ఒక పర్మినెంట్ కార్మికునీ స్థానంలోపదిమంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు, కనుకనే సింగరేణి యాజమాన్యానికి లాభాలు వస్తున్నాయి. సింగరేణి యాజమాన్యానికి వచ్చే లాభాలలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ చెమట చుక్కలు దాగి ఉన్నాయి. కాంట్రాక్టు కార్మికులకు10 శాతం లాభాల వాటాను పంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్( ఎస్ సి సి డబ్ల్యూ యు –ఐ ఎస్ టి యు) డిమాండ్ చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో స్. తిరుపతి రెడ్డి, గజ్జి మల్లేష్, మాదుగుల శంకర్, కొదురుపాక సదానందం, రాజు, గద్దల శంకర్, బాబు, రాజయ్య, తిరుపతి, మహేష్, సంతోష్, శేఖర్, పైడిరాజు, రాజు, రమేష్, వల్లకొండ రాజయ్య, సుధాకర్, రమ, లక్ష్మి, సరోజన, మల్లేశ్వరి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

**-పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో,సత్యదీపిక ఉదయం :**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం రిమ్స్ వైద్య కళాశాలలోని డైరెక్టర్ చాంబర్‌లో వైద్య, ఇంజనీరింగ్, సంబంధిత శాఖల అధికారులతో రిమ్స్ అభివృద్ధి పనులు, మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చేపడుతున్న సివిల్ పనులు, విద్యుత్ మరమ్మతులు, ఆక్సిజన్ పైప్‌లైన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న వైద్య పరికరాల నిరంతర పర్యవేక్షణ, నిర్వహణ కోసం తక్షణమే బయోమెడికల్ ఇంజనీర్‌ను నియమించాలని ఆదేశించారు. రోగులను పరామర్శించేందుకు వచ్చే సహాయకుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డుల



విధానాన్ని వెంటనే అమలు చేయాలని రిమ్స్ డైరెక్టర్‌కు సూచించారు. పనిచేయని వెంటిలేటర్లను వెంటనే మరమ్మతు చేయించడంతో పాటు, ఆసుపత్రికి అవసరమైన కొత్త వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన అత్యవసర నిధులను సద్వినియోగం చేసుకుంటూ, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్ వర్కర్లు, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధులకు సిబ్బంది హాజరు, పనితీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే కార్మికులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా మాత్రమే వేతనాలు చెల్లించేలా సంబంధిత గుత్తేదారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికుల హక్కులు, వేతన చెల్లింపుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, మౌలిక వసతులు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ పనులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ రావు, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్, వివిధ విభాగాల అధిపతులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.